పౌర సరఫరాల శాఖ డీఎంగా కొండల్‌రావు



వికారాబాద్, జనవరి 29 : పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా కొండల్‌రావు బాధ్యతలు చేపట్టారు. వనపర్తి పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌గా కొనసాగిన ఆయన బదిలీపై జిల్లాకు వచ్చారు. జిల్లా పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌గా పనిచేసిన అలివేలుమంగమ్మను ప్రభుత్వానికి సరెండర్ చేయగా, ఆమె స్థానంలో ఉన్నతాధికారులు కొండల్‌రావును నియమించారు.



జంతు సంరక్షణ పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు

జంతువులను సంరక్షించుకోవాలి

» వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 29 : జంతుహింసకు పాల్పడకుండా, జంతువుల పట్ల కరుణతో ఉంటూ వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతిపౌరునిపై ఉందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా పశువైద్య అధికారులతో కలిసి జంతు సంరక్షణ పక్షోత్సవాల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో జంతు సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రోగ నిరోధక టీకాలు వేయించాలని కోరారు. అన్ని మండలాలలో జంతు సంరక్షణ, సంక్షేమంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రజావాణికి 205 ఫిర్యాదులు

ప్రజావాణిలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి 205 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.

ఈవీఎంల వినియోగంపై ప్రదర్శన

ఈవీఎంల వినియోగంపై కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈవీఎం ప్రదర్శనను కలెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈవీఎంపై ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలనే విధానాన్ని కలెక్టర్ తెలియజేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో ఈవీఎం ప్రదర్శనశాలలను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తొలిసారిగా..!

» 5న కొడంగల్‌కు రేవంత్‌రెడ్డి రాక
» పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
» అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్న సీఎం



వికారాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వచ్చే నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లా, కొడంగల్‌లో పర్యటించనున్నారు. సీఎం హోదాలో ఫిబ్రవరి 2వ తేదీన ఆదిలాబాద్ జిల్లా, ఇంద్రవెల్లిలో పర్యటించనుండగా, 5వ తేదీన జిల్లాకు రానున్నారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా జిల్లా పర్యటనకు వస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గం పరిధిలో సుమారు రూ.500 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేసే విధంగా అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో తొలి స్కిల్ యూనివర్సిటీ ఇక్కడే ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన సీఎం.. తన తొలి పర్యటనలోనే దానికి శంకుస్థాపన చేయనున్నారు. అంతే కాకుండా కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసే పనులకు, కోస్గి, కొడంగల్‌లోని ఆసుపత్రుల అప్‌గ్రేడేషన్ పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది. కొడంగల్‌లో నిర్వహించే బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. సీఎం హోదాలో తొలిసారిగా కొడంగల్‌కు వస్తున్న రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేలా ఓ వైపు అధికార యంత్రాంగం, మరోవైపు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, సీఎం పర్యటన అధికారికంగా ఇంకా ఖరారు కావాల్సి ఉంది.

చెరలో.. దారి!

ఆక్రమణకు గురవుతున్న జాతీయ రహదారి భూములు

ఘట్‌కేసర్ పరిధిలో హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి విస్తరణ కోసం సేకరించిన కోట్లాది రూపాయల విలువైన భూమి ఆక్రమణకు గురైంది. ప్రభుత్వం భూ బాధితులకు పరిహారం చెల్లించి ఏళ్లు గడుస్తున్నా మళ్లీ అక్రమార్కులు పాగా వేశారు. అధికారులు మొద్దు నిద్ర వీడకపోవడంతో భూయజమానులే తిరిగి అనుభవిస్తున్నారు. ఆ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి కిరాయిలకు ఇస్తూ లక్షలు గడిస్తున్నారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. వాహనదారుల, ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

ఇంకా రైతుబంధు సాయం

అండర్‌పాస్ (వీయుపీ) నిర్మాణంలో భాగంగా జాతీయ రహదారుల శాఖ సేకరించిన భూమికి పరిహారం చెల్లించినప్పటికీ నేటికీ కొంత మందికి ప్రభుత్వం అందించే రైతుబంధు అందుతోంది. అధికారులు కొంతమంది పేర్లను రెవెన్యూ రికార్డుల్లో తొలగించి అస్థానంలో జాతీయ రహదారి అని రాసినప్పటికీ, మరికొందరి పేర్లను తొలగించకపోవడంతో రైతుబంధు పొందుతున్నారు.



ఎదులాబాద్ రోడ్డులో జాతీయ రహదారి స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయం

» పదేళ్ల క్రితమే జాతీయ రహదారి విస్తరణకు భూ సేకరణ
» ప్రభుత్వం సేకరించిన భూమికి పరిహారం చెల్లింపు..
» అయినా వదలని అక్రమార్కులు... అందులోనే పాగా
» అక్రమంగా నిర్మాణాలు... వ్యాపార కార్యకలాపాలకు అద్దెకు..
» ఆక్రమణలకు సైతం రైతుబంధు పొందుతున్న వైనం
» రాత్రికి రాత్రే అక్రమంగా హోర్డింగుల ఏర్పాటు.. పొంచిఉన్న ప్రమాదాలు
» చోద్యం చూస్తున్న అధికారగణం

ఘట్‌కేసర్. జనవరి 29 : హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి విస్తరణకోసం సేకరించిన భూమి ఆక్రమణకు గురైంది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఘట్‌కేసర్‌లో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డునిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి నుంచి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని కలిపే ప్రధాన లింకు రోడ్డు విస్తరణ కోసం 2014లో భూమిని సేకరించారు. డీ/6444/12 తేదీ 1/7/2014నాడు అవార్డు (పరిహారం చెల్లింపు) అయ్యింది. జాతీయ రహదారి202 విస్తరణ కోసం ఎన్‌హెచ్‌డీపీ ఫేజ్-3 కింద హైదరాబాద్ నుంచి యాదాద్రీ వరకు ఘట్‌కేసర్ రెవెన్యూలోని సర్వేనెంబర్లు 310. 311, 313, 382, 386, 398, 432ల్లో ఆరులైన్ల రోడ్డు నిర్మాణం కోసం 1.14 ఎకరాలు (6,534 చదరపు గజాలు)భూమి సేకరించారు. ఇందుకుగాను రూ. 3.10 కోట్లు పరిహారంగా చెల్లించారు. ఇది కాకా మరింత పరిహారం కోసం హర్బిట్రేషన్‌కు వెళ్లి మరో రూ.1.5కోట్ల పరిహారం పొందారు. అయినప్పటికీ ఇందులో కొంతమంది నేటికీ రైతుబంధు పొందడం విశేషం.





నిత్యం రద్దీగా ఉండే అండర్‌పాస్ రోడ్డు

హెచ్‌ఎండీఏ ప్లాన్‌లో...

ఘట్‌కేసర్‌లోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి నుంచి విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిని కలిపేందుకు అబ్దుల్లాపూర్‌మెట్టు వరకు గల స్థానిక ఎదులాబాద్ రోడ్డులో వీయుపీ (వెహికిల్ అండర్ పాస్) నిర్మించారు. ఈ రోడ్డును రోడ్లు, భవనాల శాఖలో 66 ఫీట్లుగా చూపించారు. దీనికి మరో 34 ఫీట్ల కోసం జాతీయ రహదారికి ఇరువైపుల దాదాపు అర కిలో మీటర్ వరకు రోడ్డు నిర్మాణం కోసం స్థలం సేకరించారు. ఘట్‌కేసర్ వైపు ఉన్న పోచమ్మగుడి వరకు, మరోపక్క చెటేరుకుంట సమీపం వరకు భూసేకరణ చేశారు. దీనికి గాను భూములు కోల్పోయిన వారికి పరిహారం సైతం చెల్లించారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో ఈ రోడ్డు వంద ఫీట్లుగా ఉంది. అయినప్పటికీ భూములు కోల్పోతున్న వారు ఆందోళన చేయడంతో పరిహారం చెల్లించారు. ఈ విషయమై అప్పట్లోనే పలువురు ఆందోళన వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. సర్వే నెంబర్ 310లో అండర్‌పాస్(వీయుపీ)కు ఆనుకొని ఉన్న 9 గుంటల భూమిని సైతం సేకరించారు. అయితే ఇప్పటికీ ఆ స్థలం యజమానుల అధీనంలోనే ఉంది. జాతీయ రహదారుల అధికారులు భూమిని సేకరించి, పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించారు.

సేకరించిన భూమిలో వ్యాపార కార్యకలాపాలు

జాతీయ రహదారి కోసం సేకరించిన భూమి మొత్తం 1.14 ఎకరాలకు పరిహారం చెల్లించి ఏళ్లు గడుసున్నాయి. అయితే అధికారులు మొద్దునిద్ర వీడకపోవడంతో తిరిగి భూయజమానులే అనుభవిస్తున్నారు. రహదారి కోసం సేకరించిన భూముల్లో పాగా వేశారు. ఇక్కడ గజం ధర లక్ష రూపాయాలు పలుకుతోంది. దాదాపు రూ.70 కోట్లు విలువచేసే 6,534 చదరపు గజాల స్థలాన్ని రహదారి నిర్మాణం కోసం సేకరించగా, పరిహారం పొందిన అంతా ప్రస్తుతం సంపన్నులే. ఈ పెద్దలు ఇళ్లను ఖాళీ చేయకుండా, వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేవారికి అద్దెకిచ్చారు. వాటికి వచ్చే కిరాయిలతో లక్షలు గడిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

జాతీయ రహదారి స్థలంలో హోర్డింగుల నిర్మాణం

ఘట్‌కేసర్‌లోని బైపాస్ రోడ్డులో భూగర్భవంతెన వద్ద మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అనుచరులు రాత్రికి రాత్రే అక్రమహోర్డింగు నిర్మాణం చేపట్టారు. అసలే ఇరుకుగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. వీయుపీకి ఇరువైపుల మద్యం దుకాణాలు ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇదిచాలదన్నట్లు రాత్రికి రాత్రే అక్రమంగా భారీ హోర్డింగు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో పాటు పాత జాతీయ రహదారిపై పలుచోట్ల రాత్రికి రాత్రే విచ్చలవిడిగా హోర్డింగులను ఏర్పాటు చేశారు. ఐఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా వంద ఫీట్ల రోడ్డులో 45 ఫీట్లకు కుంచించి హోర్డింగ్ వేశారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుస్టేషన్‌కు అరకిలోమీటర్ దూరంలోనే ఈ వ్యవహారం జరుగుతున్నప్పటికీ పోలీసులు మాత్రం అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు

ఇదిలా ఉంటే, ఎదులాబాద్ రోడ్డులో రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో రోజురోజుకూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. అధికారుల అలసత్వంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలతో పాటు జనాలు రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ వైపు నుంచి ఘట్‌కేసర్‌కు రావడానికి, హైదరాబాద్ నుంచి ఘట్‌కేసర్ పట్టణంలోకి రావడానికి నిర్మించిన సర్వీసు రోడ్ల నిర్మాణం అస్థవ్యస్థంగా మారింది. నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. కోట్లాది రూపాయల పరిహారం చెల్లించి భూములు సేకరించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు విస్తరణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

అక్రమ హోర్డింగ్‌లపై చర్యలు తీసుకోవాలి



ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అక్రమంగా హోర్డింగులు ఏర్పాటు చేయడంతో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఎమ్మెల్యే మల్లారెడ్డి అనుచరులు ఏలాంటి అనుమతులు లేకుండా అటు హెచ్‌ఎండీఏ స్థలంలో, ఇటు జాతీయ రహదారి కోసం సేకరించిన స్థలంలో అక్రమంగా హోర్డింగ్ ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- అబ్బసాని యాదగిరి, మాజీ సర్పంచ్, ఘట్‌కేసర్

సమాచారం లేదు



ఎదులాబాద్ రోడ్డులో ఏర్పాటు చేసిన హోర్డింగు ఏర్పాటు స్థానిక కౌన్సిలర్ అయిన నాకే సమాచారం లేదు. మున్సిపాలిటీలో ఏం జరుగుతుందో అయోమయ పరిస్థితి నెలకొన్నది. 12వ వార్డులోని ఎదులాబాద్ రోడ్డులోని మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేస్తున్న హోర్డింగుతో ప్రమాదం పొంచిఉన్నందున తక్షణమే చర్యలు తీసుకోవాలి

- మేకల పద్మారావు కౌన్సిలర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

అధికారుల నిర్లక్ష్యంతో ఆటంకం



రోడ్ల నిర్మాణం కోసం సేకరించిన భూములను అధికారులు స్వాధీనం చేసుకోకపోవడంలో అధికారుల ఉదాసీనత కనిపిస్తున్నది. ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తా వద్ద, ఎదులాబాద్ రోడ్డులోని అండర్‌పాస్ వద్ద ఇబ్బంది నెలకొన్నది. అధికారులు చర్యలు తీసుకోని స్థలాలను అప్పగిస్తే రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా.

- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎంపీపీ, ఘట్‌కేసర్

అక్రమ హోర్డింగులను తొలగిస్తాం

జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా లింకు రోడ్ల విస్తరణ కోసం సేకరించిన స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా ఎలాంటి హోర్డింగులు ఏర్పాటు చేయొద్దు, అక్రమ నిర్మాణాలున్నా తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- మాధవి, జాతీయ రహదారులశాఖ డీజీఎం

సర్పంచుల పనితీరు భేష్!

» జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి



వికారాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఐదేళ్ల పదవీ కాలంలో జిల్లాలో గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన కృషి మరువలేనిదని జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలో సర్పంచుల పనితీరు బాగుందని, అభినందనీయమని ఆమె కొనియాడారు. సర్పంచుల పదవీకాలం ముగియనున్న సందర్భంగా బాగా కష్టపడి పని చేసిన సర్పంచులందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో చాలా మంది సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధి కోసం తమ సొంత భూములు అమ్ముకున్నారని, మరి కొందరు అప్పులు చేసి పనులు చేశారని ఆమె గుర్తు చేశారు. అయితే కొన్ని గ్రామాల సర్పంచులు మాత్రం అప్పటి ఎమ్మెల్యేల అండతో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. బషీరాబాద్ మండలం బాద్లాపూర్ సర్పంచ్ నీలిబాయి అభివృద్ధి చేసి అప్పుల పాలై అడ్డమీద కూలీగా పని చేయడం తనను ఎంతగానో బాధించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచులను ప్రజలు పౌరసన్మానాలు చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ హామీలు నేరవేర్చకుంటే బట్టలిప్పి నిలబెడతాం

» లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదాం
» బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
» బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా
» మాజీ మంత్రి,ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేటీ రామారావు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

పరిగి, జనవరి 29: ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీని బట్టలిప్పి చౌరస్తాలో నిలబెడతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. పరిగిలోని ఎస్‌గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే మోసాలకు మారుపేరని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని నిరుత్సాహ పడకుండా పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలో బీఆర్‌ఎస్ సత్తా చూపుతుందని చెప్పారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ 1.63 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందని, నోటిఫికేషన్‌లే వేయలేదని బద్నాం చేశారని విమర్శించారు. దేవుడు పేరిట ఓట్లడిగే సంస్కృతికి బీజేపీ తెరలేపిందని, అక్షింతల పేరిట ఓట్లడిగే నాటకాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, మహేందర్‌రెడ్డి పార్టీ మారుతున్నాడని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానన్నారు.ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయం కోసం పని చేస్తానని తెలిపారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉనికిని, గౌరవాన్ని నిలబెట్టింది బీఆర్‌ఎస్సేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పౌల్ట్రీ పరిశ్రమ పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. కాంగ్రెస్ కరెంట్ ఇవ్వడంలో విఫలమవుతోందని, అయితే తాను పౌల్ట్రీని వదిలి బ్యాటరీ రంగంలోకి రావాలని ఆలోచిస్తున్నానని తెలిపారు. ఐటీ రంగంలో దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిపిన ఘనత కేటీఆర్‌దేనని చెప్పారు. పూడూరులో నేవీరాడార్ స్టేషన్ ఏర్పాటుతో నష్టం జరుగనుందని, తాను పోరాటానికి అండగా ఉంటానని తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ మాట్లాడుతూ, ప్రజలు కాంగ్రెస్‌ను ప్రేమతో గెలిపించలేదని, ఇంకా బాగా చేస్తారని నమ్మి గెలిపించి మోసపోయామని అప్పుడే అనుకుంటున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల ఓటమిలో ప్రజాతీర్పును గౌరవిస్తానని, అయితే అందుకు కారణాలు ఏమిటో పోసుమార్టం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, జడ్పీటీసీలు బి.హరిప్రియ,మేఘమాల, కె.నాగిరెడ్డి, రాందాస్‌నాయక్; శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీలు అరవింద్‌రావు, మల్లేశం, పార్టీ నాయకులు ఆర్.అంజనేయులు, బి.ప్రవీణ్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సురేందర్, అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

అట్రాసిటీ బాధితులకు న్యాయం చేయాలి

» కలెక్టర్ గౌతమ్

మేడ్చల్/కీసర, జనవరి 29 : మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ డీసీపీ నిఖీత్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, రాచకొండ పోలీస్ కమిషనరేట్ అధికారులతో కలిసి సోమవారం కలెక్టర్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం, అట్రాసిటీ నివారణ చట్టం కచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అట్రాసిటీ కేసులు ఎన్ని ఉన్నాయి, వాటి పురోగతి వివరాలు తెలుసుకున్నారు. అదే విధంగా విజిలెన్స్, మానిటరింగ్ సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు.

అక్రమ నిర్మాణదారులపై కేసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29: ఈనెల 22న 'బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు' అని ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. వెంకటాపూర్ నాడెంచెరువు బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేస్తున్న స్థలం యజమానులు దయంరాధాలక్ష్మి, దయం సోమిరెడ్డి, జేసీబీ డ్రైవర్ శివలపై చర్యలు తీసుకున్నారు. పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో ఐపీసీ 447, 427 కింద వారిపై క్రిమినల్ కేసు నమోదు అయ్యింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ పరమేష్ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, కాలువలు అక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ చీరలు ఏ పండక్కో!

» నెలన్నర గడిచినా రాని ఆదేశాలు
» మంత్రి సమీక్షలో సైతం పంపిణీపై రాని స్పష్టత
» జిల్లా వ్యాప్తంగా ఇంకా పంపిణీ కి మిగిలిన లక్ష చీరలు

తాండూరు, జనవరి 29: బతుకమ్మ చీరలు మూటల్లోనే మూలుగుతున్నాయి. గత ప్రభుత్వం బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలకు కానుకగా చీరల పంపిణీ చేపట్టింది. అంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో పంపిణీ ఆగిపోయిన విషయం విదితమే. ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినా వాటి పంపిణీని మరిచారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణలో బతుకమ్మ చీరల పంపిణీ పథకం యథాతథంగా సాగుతుందని, గతంలో కంటే మరింత నాణ్యతతో చీరలు తయారు చేసి పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారే తప్పా...మిగిలిన బతుకమ్మ చీరల పంపిణీపై స్పష్టత ఇవ్వలేదు. ఇంకా పంచాల్సిన చీరలు, గ్రామ పంచాయతీలు, పురపాలికలు, రేషన్ డీలర్ల వద్ద మూటల్లోనే ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల కోడ్ ముగిసి నెలన్నర దాటినా ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేవని అధికారులు పేర్కొంటున్నారు. "జిల్లా వ్యాప్తంగా 3లక్షల 37వేల 586 మంది లబ్ధిదారులుండగా జిల్లాకు రెండు లక్షల 73వేల బతుకమ్మ చీరలను అలాట్‌మెంట్ చేశారు. ఇందులో లక్షా 80వేల వరకు జిల్లా వ్యాప్తంగా చీరలను పంపిణీ చేయగా, ఇంకా లక్ష వరకు చీరలు మూలన పడేశారు. రేషన్ షాపు డీలర్లు వీటిని తీసుకెళ్లాలని రెవెన్యూ, మండల పరిషత్తు, మున్సిపాలిటీ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. మిగిలిపోయిన చీరలను ఎప్పుడు పంపిణీ చేస్తారో వేచి చూడాలి.



మూలన పడేసిన బతుకమ్మ చీరలు

పాడుబడ్డ బావులతో గుబుల్!

● రోడ్ల పక్కనున్న వ్యవసాయ బావుల పూడ్చివేతకు చర్యలేవి?


మల్కీజ్‌గూడలో ప్రమాదకరంగా ఉన్న పాత వ్యవసాయ బావి

యాచారం, జనవరి 29: మండలంలోని వివిధ గ్రామాల్లో పాడుబడ్డ వ్యవసాయ బావులు వాహనదారులకు, గ్రామస్తులకు ప్రమాదకరంగా మారాయి. రోడ్ల పక్కన ఉన్న బావులను పూడ్చివేయించాల్సిన అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. ఇలాంటి బావులపై స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం పట్టింపు లేకుండా పోయింది. మల్కీజ్‌గూడలో రోడ్డుకు ఆనుకొని ఓ వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. దీన్ని పూడ్చి వేయించడమో లేక ప్రహరీ నిర్మించడమో చేయాలి. బావి వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులూ పెట్టలేదు. రోడ్డుకు గజం దూరం లోపలే ఈ బావి ఉంది. ఈ బావిలో గ్రామస్తులు చెత్త వేస్తున్నారు. ఇదే గ్రామంలో మేడిపల్లి వెళ్లే రోడ్డులో మరో వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. చింతపట్ల నుంచి సాగర్-హైదరాబాద్ రోడ్డుపైకి వచ్చే రోడ్డులో ఓ బావిని సగం పూడ్చి వదిలేశారు. రోడ్డు పక్కనే బావి ఉండడతో వాహనాదారులు భయం భయంగా వెళ్తున్నారు. నజ్దిక్‌సింగారం-అయ్యవారిగూడల మధ్య రోడ్డు పక్కనే రెండుచోట్ల పాడుబడ్డ బావులున్నాయి. వీటిని పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న ఇలాంటి బావులను పూడ్చివేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపైనే సంతలు.. తప్పని తిప్పలు


యాలాలలో నడి రోడ్డుపై కొనసాగుతున్న సంత

యాలాల, జనవరి 29: ప్రతీ వారం గ్రామాల్లో రోడ్లపైనే కొనసాగుతున్న సంతలతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంతల నిర్వహణకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నా పట్టించుకున్న నాథుడే కరువడయ్యాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. యాలాల మండలంలో ప్రతీవారం నాలుగు గ్రామాల్లో సంతలు కొనసాగుతాయి. మండల కేంద్రమైన యాలాల్లో సోమవారం, రాస్నంలో బుధవారం, పగిడ్యాల్‌లో శుక్రవారం, ముద్దాయిపేట్‌లో ఆదివారం సంతలు కొనసాగుతున్నాయి. ఈ సంతలన్నీ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిస్తున్నారు. అయితే ప్రతీవారం కొనసాగే సంతల వల్ల వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయితీ పరిధిలో కొనసాగే ఈ సంతలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని పలుమార్లు గ్రామస్థులు కోరారు. అయినా ఏ ఒక్కరూ స్పందించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాల్లో కొనసాగే సంతలకు గ్రామపరిధిలో ప్రత్యేక స్థలం కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ గోవర్ధనగిరి


ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సీఐ గోవర్ధనగిరిని కలిసిన కాంగ్రెస్‌నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29: ఘట్‌కేసర్ సీఐగా గోవర్ధనగిరి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సీసీఎస్ ఎల్‌బీనగర్ నుంచి ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌వోగా బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన మద్ది మహేందర్‌రెడ్డి సైబర్‌క్రైంకు బదిలీపై వెళ్లారు. మండల నాయకులు, ప్రజాప్రతినిధులు గోవర్ధనగిరికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు, మాజీ ఎంపీటీసీ కందుల కుమార్, బద్దం కుమార్, వెంకట్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మేడ్చల్ మండల సర్వసభ్య సమావేశం

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పద్మశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ సమావేశం మందిరంలో సమావేశం ప్రారంభిస్తారని తెలిపారు. కావున గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

గురుకులాలు, కళాశాలల కోసం స్థల పరిశీలన

కొడంగల్ / దౌల్తాబాద్/బొంరాస్‌పేట్ : జనవరి 29: సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం పాత కొడంగల్ గిరిజన గురుకుల పాఠశాల పరిసర ప్రాంతాల్లో సోమవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా దౌల్తాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం స్థల పరిశీలన చేసి నివేదిక తయారు చేస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలలు ఒకే దగ్గర ఉండాలనే ఉద్దేశంతో గిరిజన గురుకుల బాలుర పాఠశాల పరిసర ప్రాంతాల్లోనే ఎస్సీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, దౌల్తాబాద్‌లో జూనియర్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు, త్వరలోనే పనులను ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు.

బొంరాస్‌పేట్‌లో

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం స్థలాన్ని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పరిశీలించారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆవరణల్లో స్థలాన్ని తహసీల్దార్ రవి, ఆర్ఐ రవి, సర్వేయర్ దేవేందర్‌లతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం స్థలాలను పరిశీలించామని తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు.



బొంరాస్‌పేట్‌లో కళాశాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న వెంకట్‌రెడ్డి, నాయకులు

విద్యారంగ సమస్యలపై వినతి

కొడంగల్ నియోజకవర్గంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుంకరి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య, హకీం బాల్‌రాజ్, కార్యదర్శి బాకారం మొగులప్ప, మండల అధ్యక్షుడు నారాయణ, గౌరవ అధ్యక్షుడు టి.రాములు, ట్రెజరర్ కృష్ణయ్య, కార్యదర్శి పృథ్వీసింగ్, బొంరాస్‌పేట్ మండల శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఉన్నారు.



వినతి పత్రం అందిస్తున్న తపస్ నాయకులు

గట్టు మైసమ్మ జాతర హుండీ లెక్కింపు



గట్టుమైసమ్మ హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

ఘట్‌కేసర్, జనవరి 29 : ఆదివారం జరిగిన ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ జాతర హుండీలను సోమవారం దేవాలయ కార్యాలయంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ.2,17,713 వచ్చినట్లు ఈఓ భాగ్యలక్ష్మి తెలిపారు. టిక్కెట్లు ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించాల్సి ఉందని చెప్పారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, వైస్‌ఛైర్మన్ పల్లుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నాయకులు కొంతం అంజిరెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, ముత్యాలు, బర్ల రాధాక్రిష్ణ, బర్ల హరిశంకర్, నారాయణ, దేవాలయ సిబ్బంది, పాల్గొన్నారు. ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిను చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

కార్యకర్తలపై ఈగ వాలినా సహించం

● తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరురూరల్, జనవరి 29 : గ్రామాల్లోని కాంగ్రెస్ కార్యకర్తలపై ఈగ వాలినా సహించేది లేదని, పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతారం, చంద్రవంచ గ్రామాల్లో రూ.40లక్షలు రూర్బన్ పథకం నిధులతో పూర్తయిన గ్రామపంచాయతీ భవనాలను ఆయన ఎంపీపీ ఎస్.అనితాగౌడ్, సర్పంచ్‌లు సావిత్రిబాయి రాంచందర్, బి.శ్రీదేవి విజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించిన వారికి అండగా ఉంటానన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల సమయంలో చంద్రవంచ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలను బెదిరించినట్లు తమ దృష్టికి వచ్చిందని, తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సొంత జిల్లా కావడంతో అభివృద్ధికి అధిక నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. వైస్‌ఎంపీపీ స్వరూపా, జెడ్పీటీసీ గౌడి మంజుల, ఎల్మకన్నె పీఏసీఎస్ ఛైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, స్థల దాతలు నరోత్తం, వాసుపవార్‌నాయక్, ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్, వడ్డె శ్రీనివాస్, గుర్రంపల్లి రాందాస్, న్యాయవాది మహేందర్‌రెడ్డి, బి.విజయ్‌కుమార్, జగదీశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు మల్లప్ప, రాంచందర్, రాజేందర్‌రెడ్డి, ఉదయ భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, అంజిలయ్య, నర్సింహులు పాల్గొన్నారు.



చంద్రవంచ గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కల్వకుర్తిలోని ప్రతి ఎకరాకు సాగునీరు

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్ , జనవరి 29 : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరందించి, రైతుల కలలు సాకారం చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అసంపూర్తిగా ఉన్న సాగునీటి పథకాలను పూర్తిచేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని ఆయన చెప్పారు. మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామంలో రూ.20 లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎంపీపీ కమ్లీ మోత్యనాయక్, జడ్పీటీసీ దశరథ్ నాయక్, సర్పంచ్ పోతుగంటి శంకర్, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. అన్మాస్‌పల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. పంచాయతీకి ప్రహరీ గోడ నిర్మాణానికి ఎస్డీఎఫ్ నుంచి రూ.15 లక్షలు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలలో కల్వకుర్తి నియోజకవర్గం తీవ్ర నిర్లక్ష్యం, వెనుకబాటుకు గురైందని ఆరోపించారు. గ్రామాలలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్ లకు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుందని సర్పంచ్‌లు ఆందోళన చెందవద్దని చెప్పారు. మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ పాలకుర్ల రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఏఈ పరమేశ్, పంచాయతీ కార్యదర్శి హరీశ్ రెడ్డి, నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, హన్మనాయక్, ముత్తి కృష్ణ, చేగూరి వెంకటేశ్, సుధీర్ రెడ్డి, పాపిరెడ్డి, చందోజీ, బిక్షపతి, యాదగిరి రెడ్డి, నరేశ్ నాయక్, మోత్యనాయక్, శేఖర్‌గౌడ్, సుమన్, లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, ఇమ్రాన్‌బాబా, రామకృష్ణ, జగన్,శ్రీను, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



అన్మాస్‌పల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, తదితరులు

వసతి గృహాల్లో పరిశుభ్రతపై అవగాహన

వికారాబాద్, జనవరి 29 : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలోని విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా పరిశుభ్రమైన భోజనం అందించేందుకు కుక్, కామాటి, నాలుగో తరగతి సిబ్బందికి శుభ్రతపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.శరత్ , డైరెక్టర్ నరసింహ రెడ్డి ఆదేశానుసారం జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు/వసతి గృహాల/కళాశాల వసతి గృహాలలో పని చేస్తున్న సిబ్బందికి నూతన వంట పద్ధతులు, ఆహార భద్రత, వసతి గృహాల పరిశుభ్రతపై అవగాహన కల్పించామని చెప్పారు. వికారాబాద్ సిడిపిఓ వెంకటేశ్వరి, వైద్యఆరోగ్యశాఖ మీడియా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమాధికారి కోటాజీ

కేటీఆర్‌కు మతి భ్రమించింది

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

ఘట్‌కేసర్, జనవరి 29 : అధికారం కోల్పోవటంతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావుకు మతిభ్రమించిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఎద్దేవా చేశారు. సోమవారం ఘట్‌కేసర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు. ఓటమి తర్వాత కేటీఆర్‌కు పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి కేవలం 50రోజులే ఐనప్పటికీ ప్రభుత్వంపై నోరుపారేసుకోవటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఘడీల్లో బందీ ఐన దొరల పాలనను ప్రజల్లోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ప్రజలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులకు కర్రు కాల్చి వాత పెట్టినా, వారి తీరు మారడంల లేదన్నారు. కేటీఆర్ తీరుకు విసుగు చెంది ఆయన నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు మూకుమ్మడి రాజీనామాలకు దిగుతున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావటం ఖయమన్నారు. ప్రజా తీర్పును గౌరవించకుండా అవాకులు చెవాకులు పేలటం మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకోవాలని కేటీఆర్‌కు హితవు పలికారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, జనవరి 29 : హోంగార్డుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని రాష్ట్ర హోంగార్డు సంఘం సభ్యులు తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ ఛైర్మన్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. సోమవారం రాష్ట్ర హోంగార్డ్స్ సంఘం సభ్యులు అశోక్ వరంగల్, దయానంద్ కొత్వాల్ , కుమారస్వామి, అశోక్‌కుమార్ సైబరాబాద్ , హరిబాబు, చాంద్‌పాషా వికారాబాద్, వివిధ జిల్లాల హోంగార్డులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర హోంగార్డ్స్ సంఘం సభ్యులు

ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తా

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, జనవరి 29 : పెద్దేముల్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. జడ్పీటీసీ ధారాసింగ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మండలస్థాయి క్రీడలను నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో మినీస్టేడియం నిర్మించేందుకు ఆసక్తి కలిగిన దాతలు ముందుకు రావాలని కోరారు. స్టేడియం నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. లేదంటే సీడీపీ నిధుల నుండి తానే ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. జిల్లాలోనే మోడల్‌గా ఇండోర్ స్టేడియాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనువైన స్థలం ఉంటే చూడాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రతి విద్యార్థి కూడా కొంత సమయాన్ని క్రీడలకు కెటాయించాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని చెప్పారు. క్రీడాకారులతో కరచాలనం చేసి వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడలను ప్రారంభించారు. వైస్ఎంపీపీ మధులత, ఎల్మకన్నె పీఏసీఎస్ ఛైర్మన్ రవిగౌడ్, వైద్యులు సంపత్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాని, నాయకులు ఉత్తంచంద్, ఏబ్లాక్ అధ్యక్షుడు లొంకనర్సిములు, న్యాయవాది ఎల్లారెడ్డి, వర్కింగ్‌ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

కీసర, జనవరి 29 : ప్రజావాణి సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 129 ఫిర్యాదులు వచ్చాయని, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపుకలెక్టర్

మృత్యుంజయుడు

● కదులుతున్నరైలు ఎక్కుతూ కింద పడి..

● ప్రాణాలతో బయటపడి..

వికారాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కదులుతున్న రైలు ఎక్కుతున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు ప్లాట్‌ఫారం కింద పడిపోయాడు.. ప్రాణాలతో బయట పడ్డాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి వికారాబాద్ రైల్వే జంక్షన్‌లో జరిగింది. ఒకటో ప్లాట్‌ఫాం నుంచి బయలు దేరిన యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఓ వ్యక్తి పరుగెత్తుతూ ఎక్కబోయి ఆ వేగానికి ప్రమాదవశాత్తు ప్లాట్‌ఫారం కిందకు దూసుకు వెళ్లాడు. ఆ సమయంలో కింద పడ్డ వ్యక్తి ప్లాట్‌ఫారం వైపు ఒదిగి ఉండిపోయాడు. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు కేకలు వేస్తూ అప్రమత్తం చేయడంతో రైలును నిలిపివేశారు. కాగా, ప్లాట్‌ఫారం, రైలు మధ్య ఇరుక్కు పోయిన ఆ వ్యక్తి (45)ని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోయింది. తుది ప్రయత్నంగా ప్లాట్‌ఫారంను కొంత భాగం తొలగించి అతన్ని బయటకు తీశారు. ప్లాట్‌పారం బయటకు తీసే ప్రయత్నంలో ఆ వ్యక్తికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, గాయపడ్డ ఆ వ్యక్తి ఎక్కడి నుంచి ఎక్కడకు ప్రయాణిస్తున్నాడు, అతను ఎవరనేది వివరాలు తెలియరాలేదు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



శంషాబాద్ నుంచి కార్ల ఊరేగింపుతో వెళ్తున్న సేవెళ్ల మహేందర్

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడి కార్ల ర్యాలీ

శంషాబాద్, జనవరి 29 : బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన శంషాబాద్‌కు చెందిన సేవెళ్ల మహేందర్ సోమవారం పట్టణ కేంద్రంలో కార్లతో ర్యాలీ నిర్వహించి నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ఊరేగింపుగా వెల్లారు. శంషాబాద్ పోచమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ హనుమాన్‌బస్తీ, రైల్వేకమాన్, సిద్ధప్పరోడ్డు, మహవీర్‌బిల్డర్స్, బస్టాండు చౌరస్తా, అంబేద్కర్‌చౌరస్తా, గుండా సాగింది. కార్యకర్తలు బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ బీజేవైఎంకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తెస్తానని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు కృషిచేస్తానన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సీఐకి ఘన వీడ్కోలు



సీఐ మహేందర్‌రెడ్డికి వీడ్కోలు పలుకుతున్న ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29: ఎనిమిది నెలలుగా ఘట్‌కేసర్ సీఐగా పనిచేసిన ఎం.మహేందర్‌రెడ్డి బదిలీపై వెళ్లారు. సోమవారం ఆయనకు మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, పోలీసు సిబ్బంది, కబడ్డీ క్రీడాకారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిది నెలలుగా ఘట్‌కేసర్ ప్రజలతో మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. నాలుగేళ్ల చిన్నారి కిడ్నాప్ కేసును 24గంటల్లో ఛేదించి చిన్నారిని సురక్షితంగా తీసుకురావడం ఎప్పటికీ మరిచిపోలేనని తెలిపారు. ఆ సమయంలో తోటి ఎస్‌ఐలు, సిబ్బంది తనకు తోడుగా నిలిచారని తెలిపారు. అనంతరం మహేందర్‌రెడ్డిపై పూలు చల్లుతూ ప్రత్యేక వాహనంలో పోలీసుస్టేషన్ నుంచి ఘట్‌కేసర్ పట్టణం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు అశోక్, శేఖర్, శ్రీకాంత్, ప్రజాప్రతినిధిలులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం: కేటీఆర్



మన్నెగూడలో చాయ్ తాగుతూ మండల నాయకులతో మాట్లాడుతున్న కేటీఆర్

పూడూరు, జనవరి 29: ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన చాకలి రవి రెండు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ తరపున కుటుంబసభ్యులకు రూ.2లక్షల చెక్కును అందజేశారు. వారితో మాట్లాడి మనోధైర్యాన్ని కల్పించారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి పిల్లలపై చదువులకు ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. గ్రామంలో పిల్లలకు జాండీస్ వచ్చిన విషయాన్ని తెలుసుకున్న ఆ పిల్లల తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి చేవెళ్లలోని ఎంపీ రంజిత్‌రెడ్డి ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స చేయిస్తామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి పరిగి సమావేశం అనంతరం మన్నెగూడకు వచ్చిన కేటీఆర్ మన్నెగూడ చౌరస్తాలో ఉన్న అతియా హోటల్‌లో మండల నాయకులతో కలిసి ఎంపీ ఎన్నికలపై వారి కి దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అనిల్‌రెడ్డి, ఎంపీపీ మల్లేశం, జడ్పీటీసీ మేఘమాల, మండల బీఆర్ఎస్ నాయకులు హజార్, ఆదిల్, వినోద్, రాజేందర్ ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

మేడ్చల్ టౌన్, జనవరి 29: రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణం కిష్టాపూర్ నివాసి ప్రభాషిణి(18) సమీపంలోని సింఘానియా పరిశ్రమలో పని చేసి ఆదివారం రాత్రి నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో కిష్టాపూర్ వద్ద ట్రాక్టర్ ఢీకొంది. దీంతో ప్రభాషిణికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి ఎన్ఎఫ్‌సీనగర్ సమీపంలో నగరంలోని నేరేడ్‌మెట్‌కు చెందిన దేవసాని గణేష్(29), ఆయన మిత్రుడు హరీష్ శనివారం రాత్రి ఖాజీపేట నుంచి హైదరాబాద్‌కు బైక్పై వెళ్తున్నాడు. ఎన్ఎఫ్‌సీనగర్ సమీపంలోని వంతెన వద్దకు చేరుకోగానే ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి అదే లారీని ఢీకొట్టగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్ర రక్త గాయాలైన గణేష్ సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్థల దాతకు సన్మానం



దాత వాసుపవార్‌నాయక్, ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తండావాసులు

తాండూరురూరల్, జనవరి 29: అంతారం తండాలోని పంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని కొనుగోలు చేసి ఇచ్చిన దాత వాసుపవార్‌ను తండా వాసులు సన్మానించారు. సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గ్రామంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించగా, తండా వాసులు ఎమ్మెల్యేతోపాటు వాసుపవార్‌ను సన్మానించారు. పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం లేకపోవడంతో వాసుపవార్‌నాయక్ తండాలో గుండ్యానాయక్‌కు చెందిన స్థలాన్ని రూ.2లక్షల 50వేలకు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వాసుపవార్‌ను స్థానికులు అభినందించారు. ఆయనతోపాటు సర్పంచ్ సావిత్రిబాయి రాంచందర్, ఎంపీపీ అనితా గౌడ్, జడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ అధికారి రతన్‌సింగ్, డీఈ వెంకట్‌రావు, ఏఈ నందిని, కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, ఉత్తమ్ చంద్ పాల్గొన్నారు.

కంఠంలో ప్రాణమున్నంతవరకూ ప్రజాసేవ చేస్తా

● ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

శామీర్‌పేట, జనవరి 29: కంఠంలో ప్రాణమున్నంతవరకూ మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు, టీఆర్ఎస్ కార్యకర్తలను మరచిపోకుండా సేవచేస్తానని మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం మేడ్చల్ మండల, గుండ్లపోచంపల్లి మున్సిపల్ టీఆర్ఎస్ కార్యకర్తలకు కృతజ్ఞతలను తెలిపేందుకై విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల్లో రాత్రింబవళ్లు లెక్కచేయకుండా ఎంతో కష్టపడి అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారని అన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం అందరికీ రాదని, మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు తనకు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించి ఆ అవకాశాన్ని కల్పించారని తెలిపారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తమ ఆస్పత్రుల్లో మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు తన తమ్ముడు, అన్న, అల్లుడు, కుమారుడు ప్రజలకు ఉచితంగా ఆరోగ్య సేవలను చేశారని తెలిపారు. అందుకు ప్రజలు మరచిపోకుండా ఎన్నికల్లో తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించారని మల్లారెడ్డి అభినందించారు. ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో మల్లారెడ్డి ఓడకుండా బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా ఉంటూ మల్లారెడ్డి గెలుపునకు ఎంతగానో కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే సత్తా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, ప్రజల హక్కులను కాలరాస్తోందని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ యువనాయకుడు భద్రారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ శైలజావిజయానందరెడ్డి, జిల్లా మాజీ రైతు సమన్వయసమితి అధ్యక్షుడు నందారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌వైకేఎస్ జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా పసుల మహేష్



మహేష్

వికారాబాద్, జనవరి 29: నెహ్రూ యువకేంద్ర సంఘటన్ జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కల్‌ఖోడ గ్రామానికి చెందిన పసుల మహేష్‌ను మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కేంద్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవిని అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో యువత పట్ల, విద్యార్థుల పట్ల అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ఎంపికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

మొక్కు చెల్లించుకున్న ఎమ్మెల్యే



ఆలంపల్లి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 29: జిల్లా కేంద్రంలోని ఆలంపల్లి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో మొక్కు చెల్లించుకున్నారు. ఎన్నికల సమయంలో తాను గెలుపొందాలని కోరుకుంటూ మనోహర్‌రెడ్డి ముడుపు కట్టారు. తాండూరు నుంచి ఆయన ఎమ్మెల్యే గెలుపొందగా సోమవారం ఉదయం పెద్దేముల్, తాండూర్ నాయకులతో కలసి ముడుపువిప్పి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిని నారాయణరెడ్డి, సాయిని శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, భాస్కర్‌రెడ్డి, గంగాధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఊరడమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

పెద్దేముల్: మండలంలోని మంబాపూర్ గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న ఊరడమ్మ జాతర ఉత్సవాలకు చివరిరోజు సోమవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఊరడమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు. చైతన్యనగర్ గ్రామంలో పర్యటించి రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, వైస్ఎంపీపీ మధులత, కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, హర్షవర్దన్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి అవసరమయ్యే పరిశోధనలు చేయాలి



వివరాలు అడిగి తెలుసుకుంటున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29: సమాజానికి అవసరమయ్యే పరిశోధనలు చేయాలని అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధి వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన 'తేజాస్ 2కే24 ఇంజనీరింగ్ ఎక్స్‌పో'ను ఆయన ప్రారంభించారు. ఇంజనీరింగ్ నుంచే పరిశ్రమలకు అవసరమయ్యే ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. నవభారత నిర్మాణంలో యువ ఇంజనీర్లు కీలకపాత్ర పోషించాలని కోరారు. చెడు వ్యవసనాలకు దూరంగా ఉండి కష్టపడి చదవాలన్నారు. ఎక్స్‌పోలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలను ఆయన తిలకించారు. 140 వినూత్న ప్రదర్శనలను చేశారని, ఇవి సామాజిక ప్రభావ ప్రాజెక్టులని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ యూబీ దేశాయ్, రిజిస్ట్రార్ బాలాజీ, ఆయావిభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత విద్వేషాలను పెంచిపోషిస్తున్న బీజేపీ



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 29: దేశంలో బీజేపీ కులాల మధ్య చిచ్చుపెట్టి మత విద్వేషాలను పెంచి పోషిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ అన్నారు. ఫిబ్రవరి 16న సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ నాయకులు మేడ్చల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశం కుల మతాల మధ్య విద్వేషాలు పెరిగాయే తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. వివిధ రంగాల్లో ఉన్న కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దేశ సమైక్యతను విచ్ఛిన్నం చేసే శక్తులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. దేశ ప్రజలు మంచి రోజులు చూడాలంటే బీజేపీ విధానాలను వ్యతిరేకించాలన్నారు. కులం, మతం ఉచ్చులోపడి భవిష్యత్తును నాశనం చేసుకోరాదన్నారు. ఈ సందర్భంగా సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్.దేవేందర్, నాయకులు రమేష్, నర్సింగ్ రావు, ప్రేమలత పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



జనార్దన్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్, పార్టీ ఇతర నాయకులు

శామీర్‌పేట, జనవరి 29: సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు జనార్దన్‌రెడ్డి మృతి సీపీఐ పార్టీకి తీరనిలోటని ఆపార్టీ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్ అన్నారు. పొన్నాల్ గ్రామానికి చెందిన సీపీఐ, ఏఐటీయూసీ భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు జనార్దన్ రెడ్డి సోమవారం ఉదయం అనారోగ్యంతో బాధపడుతూ గాంధీ ఆస్పత్రిలో మృతి చెందాడు. అనంతరం జనార్దన్‌రెడ్డి మృతదేహాన్ని స్వగ్రామం పొన్నాల్ గ్రామానికి తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్ పార్టీకి చెందిన ఇతర నాయకులు శ్రీనివాస్, రాములుగౌడ్, వెంకటేశ్, కృష్ణ తదితర నాయకులు మృతుడు సీపీఐ నాయకుడు జనార్దన్‌రెడ్డి నివాసం పొన్నాల్‌కు వెళ్లి బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జనార్దన్‌రెడ్డి మృతదేహాన్ని ఎర్రజెండాలు కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యదర్శి సాయిలుగౌడ్ మాట్లాడుతూ జనార్దన్‌రెడ్డి సీపీ, ఏఐటీయూసీ పార్టీలో ఉన్న కార్మికుల, కర్షకుల, నిరుపేదలకు అండగా ఉంటు వారి సమస్యల పరిష్కారానికి ఎంతో పోరాటం చేశాడని తెలిపారు. ఆయన ఎర్రజెండాను పట్టి అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని పేదల పక్షన న్యాయ పోరాటం చేసిన మహానుభావుడని కొనియాడారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ హరిశ్చంద్ర ప్రసాద్

కీసర, జనవరి29: క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ టి. హరిశ్చంద్ర ప్రసాద్ అన్నారు. మండల పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం క్రీడ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా టి. హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించాల్సిన బాధ్యత తల్లిదండ్రుల దేనని, చిన్నారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ మేరకు వివిధ రంగాలల్లో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుచరితరాయ్, అకాడమీ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రమోద్ శాయ్ జోయస్ పాల్గొన్నారు.


కేంద్రమంత్రితో రచయిత భేటీ



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న భాస్కరయోగి

పరిగి, జనవరి 29: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో రచయిత, ప్రముఖ విశ్లేషకుడు డాక్టర్ పి.భాస్కరయోగి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. భాస్కరయోగి తాను రచించిన పలు పుస్తకాలను కేంద్ర మంత్రికి అందజేశారు. అనంతరం ఆయనను సత్కరించారు. అదేవిధంగా రాజకీయ, సామాజిక అంశాలపై చర్చించారు.

గ్రామానికి రోడ్డు వేయాలి



జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 29: రావల్ కోల్ గ్రామం గుడెంగడ్డ, దొంగల గుట్ట తండా వరకు రోడ్డు వేయాలని కోరుతూ సీపీఎం నాయకులతో కలిసి పలువురు గిరిజనులు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. రావ్‌కోల్ గ్రామంలోని జీవన్‌రెడ్డి ఇంటి నుంచి తమ తాండాల వరకు రోడ్డు వేయక పోవటంతో తండా వాసులకు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నాయని తెలిపారు. గిరిజన తండాకు రోడ్డు సరిగాలేకపోవడంతో బస్సులు రావడం లేదన్నారు. విద్యార్థులు కిలోమీటర్ల తరబడి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడుతున్న గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది

కొడంగల్ రూరల్, జనవరి 29: గ్యాస్ ఏజెన్సీల సిబ్బంది గ్యాస్ సిలిండర్‌ల కొరత ఉందని, బహిరంగంగా గృహ వినియోగదారుల సిలిండర్‌లను హోటళ్లు, టిఫిన్ సెంటర్‌లకు విక్రయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎంఐఎం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ ఆరోపించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి, బొంరాస్‌పేట్ పట్టణాల్లో గల భారత్, ఇండేన్ గ్యాస్ ఏజెన్సీల సిబ్బంది రోజూ కొరత ఉందంటూ వినియోగదారులకు అందించకుండా బయటి మార్కెట్‌లో హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. సిలిండర్ల కోసం బుక్ చేసుకుని రోజులు గడుస్తున్నా వారికి కొరత పేరు చెబుతూ ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కమ్యూనిటీ హాలు పేరును మార్చొద్దు



ఎంపీడీవో పద్మశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీరంగవరం గ్రామస్తులు

మేడ్చల్ టౌన్, జనవరి 29 : మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో ఇటీవల నిర్మించి ప్రారంభించిన కమ్యూనిటీ హాల్ పేరును మార్చొద్దని పలువురు గ్రామస్తులు మేడ్చల్ ఎంపీడీవో పద్మశ్రీకి సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈనెల 27న గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మించి ప్రారంభించారని, ఈ కమ్యూనిటీ హాల్ పేరు మార్చడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఇపయోగపడే కమ్యూనిటీ హాలు పేరును మార్చరాదని గ్రామస్తులు ఎంపీడీవోను కోరారు.

టెండర్ డబ్బులు ఇవ్వాలి

వికారాబాద్, జనవరి 29: 18వ వార్డు ఇందిరానగర్‌లో 2022లో వేసిన సీసీరోడ్డు పనులకు సంబంధించి ఇప్పటి వరకు టెండర్ వేసి డబ్బులు ఇవ్వడంలేదంటూ కాంట్రాక్టర్ స్రవంతి ఆరోపించింది. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం మునిసిపల్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేసింది. రూ.2లక్షల వరకు టెండర్ డబ్బులు రావాల్సి ఉందని తెలిపింది. కౌన్సిలర్ కొండేటి కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ ఆదేశానుసారం రోడ్డు వేసినట్లు తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకుని డబ్బులు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

రంజిత్‌రెడ్డిని ఎంపీగా రెండవ సారి గెలిపించాలి

వికారాబాద్: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ జి. రంజిత్ రెడ్డిని రెండవసారి చేవెళ్ల పార్లమెంట్ సభ్యునిగా భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బీఆర్‌టీయూ జిలా అధ్యక్షుడు టైగర్ భూమొల్ల కృష్ణయ్య ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిని మార్చిఉంటే భారీ మెజార్టీతో వికారాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలిచేదని అభిప్రాయపడ్డారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అహంకారంతో వ్యవహరించడం, ప్రజల్లో ఆయన పైన తీవ్ర వ్యతిరేకత ఉండటంతో ఓడిపోవడం జరిగిందన్నారు. జిల్లాలో మళ్లీ పార్టీకి పునర్ వైభవం రావాలంటే ఎంపీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కీసర రూరల్, జనవరి 29: నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను సోమవారం చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రాముప్రసాద్, 17వ వార్డు ప్రసిడెంట్ నాగరాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బియ్యం సక్రమంగా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పురుషోత్తం

దోమ, జనవరి 29: రేషన్ డీలర్లు లబ్ధిదారులకు బియ్యం సక్రమంగా అందించాలని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ కార్డులకు ఈకేవైసీ చేసుకోవడానికి ఫిబ్రవరి 29 వరకు గడువు విధించినట్లు తెలిపారు. రేషన్ డీలర్‌లు సరుకుల విషయంలో అవకతవకలకు పాల్పడరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ప్రకాశ్, డీలర్‌లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి

దోమ, జనవరి 29: మండలంలోని మూడో వార్డులో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కె.రాజిరెడ్డి సోమవారం ప్రారంభించారు. కాలనీలో మిగిలిపోయిన సీసీ పనులను వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలోని 12 వార్డుల్లో మెయిన్‌రోడ్డుకు లింక్ ఉన్న వార్డుల్లో సీసీరోడ్లు వేశామని తెలిపారు.

దొంగ ఓట్లను గుర్తించి తొలగించాలి

ధారూర్, జనవరి 29: గ్రామంలో ఉన్న దొంగనోట్లను గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని ఎబ్బనూర్ గ్రామస్తులు కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ధారూర్ మండలం ఎబ్బనూర్ గ్రామస్తులు ప్రజావాణిలో దొంగ ఓట్లను తొలగించాలని వినతి పత్రం అందజేశారు. బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజేందర్ రెడ్డి, రాంచంద్రయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం



డిప్యూటీ తహసీల్దార్‌ను సన్మానిస్తున్న స్థానికులు

కులకచర్ల, జనవరి 29: వికారాబాద్ జిల్లా ఉత్తమ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికై గణతంత్ర వేడుకల్లో అవార్డు అందుకున్న కులకచర్ల డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌ను సోమవారం గ్రామస్థులు సన్మానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు కలగకుండా ఆయన విధులు నిర్వహించారు. దీంతో జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డును పొందారు. స్థానికులు తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు సర్పంచ్‌లకు సన్మానం

తాండూరురూరల్, జనవరి 29: గ్రామపంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్నందున నేడు(మంగళవారం) పౌరసన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ రాజప్పగౌడ్ తెలిపారు. తాండూరు గౌతాపూర్ గ్రామపంచాయతీలో ఉదయం 10 గంటలకు పదవీకాలం పూర్తి చేసుకుంటున్న సర్పంచ్, ఉపసర్పంచ్‌లను పౌర సన్మానం చేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ఎంపీపీ, ఎంపీటీసీలు, డీఎల్‌పీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు రాజప్పగౌడ్ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మన్నెగూడలో అవగాహన కల్పిస్తున్న చెన్‌గోముల్ పోలీసులు

పూడూరు, జనవరి 29: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చన్‌గోముల్ పోలీసులు సూచించారు. మండలంలోని మన్నెగూడలో సోమవారం ప్రజలకు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను అదునుగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎక్కడ చూసినా సెల్‌ఫోన్ల వినియోగం పెరిగినందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.